

గిరిజన బాలికలకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు - రెడ్ షర్ట్, రెడ్ శారీస్ వాలంటీర్ల ప్రదర్శన

- సిపిఐ జిల్లా మహాసభలు ప్రారంభం - అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేసి మనువాదాన్ని తీసుకురావాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తుందని అందరం ఐక్యంగా భారతదేశాన్ని, మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వామపక్ష పార్టీలపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. శనివారం సిపిఐ జిల్లా మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జిల్లా పరిషత్ నుండి డప్పు, డ్రమ్స్ వాయిద్యాలు, వివిధ మతాలకు చెందిన వేషధారణలు రాష్ట్రాల వేషాలతో రెడ్ షర్టు ,రెడ్‌శారీస్ వాలంటీర్లతో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన ముందుభాగాన గుర్రపు, అంబారి నత్యాలు చేస్తూ బాణాసంచా కాలుస్తూ ర్యాలీ కొండారెడ్డి బురుజు వరకు చేరింది. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. దొంగ ఓట్ల, దొంగ నోట్ల రాజ్యం పాలించే వారి పాలన ఒక పాలనా అని ప్రశ్నించారు. ఒకప్పుడు రిగ్గింగ్ ఓట్లతో గెలుపొంది పాలిస్తే, ప్రస్తుతం ఇవిఎం మిషన్లతో గెలుస్తూ పాలన చేస్తున్నారు, దొంగలు రాజ్యం రాహుల్ గాంధీ సర్వే చేసి ప్రకటించారు. 1994లో ఎన్నికల కమిషనర్ టిఎన్ శేషన్ చెప్పుకు అభ్యర్థులు భయపడే వారని అన్నారు. రాహుల్ గాంధీ చెబితే నమ్మకం లేక కాంగ్రెస్ పార్టీ సమస్యలను సృష్టిస్తున్నారని చెప్పారు. సిపిఐ దేశాన్ని ఏళ్లుగా పోయిన ప్రజల పక్షాన నిలబడి వారికి కనీస అవసరాల కోసం పోరాడుతుందని చెప్పారు. అన్ని మతాలు, కులాలు కలిసి మెలిసిండి అంబేద్కర్ రాసిన రాజ్యాంగామని, బిజెపి ప్రభుత్వం మనస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రాసుకుంటామని చెబుతుందన్నారు. మతోన్మాదులనుంచి భారతదేశాన్ని అందరం కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం 13 సంవత్సరాల పేదలకు ఏం చేసిందని ప్రశ్నించారు. రైతులకు సంవత్సరానికి రూ.6000 ఇచ్చి మేలు చేశారా? రైతుల బాధల గురించి ఆలోచించారా? రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చావు? ఖాళీలు భర్తీ చేయలేదు అని ప్రశ్నించారు.మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజ్యమేలుతున్నావన్నారు. బ్లాక్ మెయిల్ చేస్తూ వినకపోతే కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారన్నారు. మోడి విధానాలకు వ్యతిరేకంగా ఒక్కరోజైనా సీనియర్ నాయకుడు



బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఆయన చంద్రబాబు నాయుడు మాట్లాడావా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడినప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించేందుకు నేను ఉన్నాను అంటూ వచ్చిన పవన్ కళ్యాణ్, జగన్, చంద్రబాబు నాయుడు లు ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదన్నారు. మహమ్మదీయులను, క్రైస్తవులను వేరుచేసి మతాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. నరేంద్ర మోడీని గద్దె దింపేందుకు ఈ మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. డబల్ ఇంజన్ సర్కారు చంద్రబాబు అంటున్నారు ఏమి చేసిందని , వేలకోట్ల అప్పుడు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఏ ఒక్క కార్యాలయంలో నైనా లంచం లేకుండా పనులు చేస్తున్నారా అని ప్రశ్నించారు. జగన్ ఇసుక మాఫియా బియ్యం లాంటివి కాజేస్తే మీరేం చేస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు స్థలం ఇచ్చి రూ.ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 26 నాటికి సిపిఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఖమ్మం నగరంలో పండుగ జరుపుకోబోతుందని తెలిపారు. పోరాటాలలో ఘన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని అన్నారు. వామపక్ష భావాలు కలిగిన పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహానుభావులు దేశంలో 4,500 మంది రక్తతర్పణ చేసి భూ పంపిణీ చేశారని చెప్పారు. దేశాన్ని కాపాడటంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు జరుపుకొని కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటామన్నారు. నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి వందన సమర్పణతో సభ ముగిసింది. ఈ సమావేశంలో రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శేఖర్, లెనిన్ బాబు హిమలింగప్ప, లలితమ్మ ఐప్సో సంఘం నాయకులు కె.జగన్నాథం, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర సహాయ కార్యదర్శి మహేష్, శేఖర్, పి .రామకృష్ణ ఆజాద్ బాబు నంద్యాల జిల్లా నుండి రంగనాయకులు శ్రీనివాసులు సమీర్ బాషా చంద్రశేఖర్ ,కారుమంచి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు, పాల్గొన్నారు.



సిపిఐ ప్రదర్శనకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా - ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి రోడ్డులేని గ్రామాలను పరిశీలన చేశామన్నారు, దాదాపుగా 29 గ్రామాలకు రోడ్లు వచ్చాయని, ఇందులో 14 గ్రామాలకు రోడ్డు వేయించామన్నారు. మిగిలిన 15 రోడ్లు శాంక్షన్ చేసేందుకు గాను ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 10వ తరగతిలో జిల్లా అంతట 86 శాతం ఉత్తీర్ణత సాధిస్తే గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన పాఠశాలల్లో 94 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలను రూ.8 కోట్లతో మరమ్మతులు చేయించామన్నారు. వంట సామాగ్రి, ఇతర వస్తువులను కూడా కొత్తవి తెప్పించామన్నారు. అట్రాసిటీ యాక్ట్ కింద ఏ జిల్లాకి లేని విధంగా మన జిల్లాకు రూ.4 కోట్ల పరిహారం మంజూరు చేయించామని, బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు కూడా ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ మాట్లాడుతూ... 500 ఎస్‌టి జనాభా గల తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటిస్తున్నామన్నారు. పల్లె క్రాంతి పథకంలో ఎస్టీలకు 100శాతం సబ్సిడీతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని 10వ తరగతిలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి కొండయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, జిల్లా స్థాయి అధికారులు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, గిరిజన సంఘాల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు పూర్తి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు కస్తూరిబా స్కూల్, హై స్కూల్ లో చేపట్టిన అదనపు తరగతి గదులను వెంటనే పూర్తిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని పాఠశాలల పరిశీలనలో భాగంగా కేజీబీవీ, ఉన్నత పాఠశాలలో సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలన చేసింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, మండల కార్యదర్శి బి.నాగన్న ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదనపు గదుల నిర్మాణ పనులను చేపడుతున్న నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారన్నారు. నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలని, త్వరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు జి.శ్రీధర్, ఎస్.మధు సూదన్, టి.మల్లేష్ , శ్రీరాములు పాల్గొన్నారు.



పాఠశాల గదలు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గౌస్‌దేశాయ్

పి4 కుస్తీ ముందుకు సాగేనా..?

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్టునర్ షిప్ (పి4) పథకం పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తుంది. ఈ ప్రధకం ప్రధాన లక్ష్యం పేదరికాన్ని నివారించడం. దీనికి నిధులెక్కడ అంటే ధనవంతులు పేదలకు సహకరించడానికి ముందుకు వచ్చి సహకరిస్తే అందరినీ పేదరికం నుంచి బయటపడేయాలని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. పేదలకు సహకరించడానికి ముందుకు వచ్చిన వారిని మార్గదర్శులని, పేదరికంలో ఉండే కుటుంబాలను బంగారు కుటుంబాలని నామకరణం చేసింది ప్రభుత్వం. సరే చెప్పడానికి చాలా బాగుంది. కలెక్టర్ల ద్వారా తరుచూ రివ్యూ చేస్తూ బంగారుకుటుంబాలను, మార్గదర్శులను గుర్తించాలని అధికారులపై వత్తిడి పెంచారు. ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేయాలని వెంటబడుతున్నారు. మరి మార్గదర్శులు ముందుకు రావడం లేదు. మరోపక్క బంగారు కుటుంబాలను గుర్తించే సర్వే కూడా పూర్తి కావడం లేదు. కర్నూలు జిల్లాలో 26 మండలాల్లో ఇంకా ఎనిమిది మండలాల్లో బంగారు కుటుంబాల సర్వేనే పూర్తి కాలేదు. ఇప్పటికి దాదాపు 15వేల బంగారు కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో 29 మండలాలకు గాను ఇంకా అన్ని మండలాల్లో పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 43 వేల బంగారు కుటుటుంబాలను గుర్తించారట. మార్గదర్శులు 5300 మంది ముందుకు వచ్చినట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మార్గదర్శులు సహాయం ఎంతచేస్తారు. ఎన్ని బంగారు కుటుంబాలకు సాయంచేస్తారనేది గాలిలో దీపమే.

జనంమాట: మార్గదర్శులుగా అధికార ప్రతిపక్ష అధినేతలు , శతకోటీశ్వరులైన వ్యాపారులు ఎందుకు ముందుకు రారని జనం ప్రశ్నిస్తున్నారు. టిడిపి అధినేత మనవడికి అప్పుడే కోట్ల ఆస్తి ఉన్నట్లు లెక్కలు చెప్పారు. కోట్ల మంది పైసా ఆస్తిలేని బాలలున్నారు. ఇలాంటి బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి ఆయాపార్టీలలోని కోటీశ్వరులు మార్గదర్శులు కాకుండా. ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారులు మార్గదర్శులు కావాలని మీటింగులు వేయడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఎస్ఐఆర్ నిరసన: కేంద్ర ఎన్నికల కమిషన్ బిజెపి అడుగులకు మడుగులు వత్తే విధంగా ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యయుతమైన ఓట్లను తొలగించినట్లు బయటకు రావడంతో ప్రతిపక్షపార్టీలు నిరసన తెలిపారు. వెంటనే ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలుకలెక్టరేట్‌ముందు, నంద్యాల గాంధీచౌక్‌లో సిపిఎం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

టామోట రైతుకు కమీషన్ బెడద: పత్తికొంట టమోట మార్కెట్‌లో రైతుల గిట్టుబాటు ధర లభిస్తున్న సమయంలో కమిషన్ ఏజెంట్లు ఐదు శాతం నుంచి 10 శాతం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

స్మార్ట్‌మీటర్ల నిరసన : స్మార్ట్‌మీటర్లను ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఇంటనీరింగు కౌన్సిలింగు: ఇంజనీరింగు కౌన్సిలింగ్ రెండో విడత ముగిసింది. సిఎస్ఇ వైపు ఎక్కువ మంది మొగ్గుచూపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయలసీమ విశ్వవిద్యాలయం కళాశాలతోపాటు 12 ప్రయి వేటు ఇంజనీరింగు కాలేజీలున్నాయి. మొదటి కౌన్సింగులో 8,076 మంది విద్యార్థులు వివిధ బ్రాంచీలను ఎంపిక చేసుకున్నారు. గతంలో మెకానికల్, ట్రిపుల్ ఇ, ఇసిఇ, ఇ సిసి, ఐటి వంటి కోర్ బ్రాంచీలను ఎంపిక చేసుకునే వారు . ఆయా బ్రాంచీలలో చదువు పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు దక్కక పోవడంతో కంప్యూటర్ ఆధారిత కోర్సులు కోడింగు, డీకోడింగు, జావా వంటి కోర్సులు నేర్చుకోవల్సి వచ్చేది. తాజా కౌన్సింగులో కంప్యూటర్ ఆధారిత కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఎక్కువ మంది సిఎస్ఇకి 2916, ఇసిఇకి 1362, సిఎఐకి 816 మంది మొదటి ప్రాధాన్యత ఇచ్చారు.



వర్థంతులు-పుట్టిన రోజులు : ఈ వారంలో సిపిఎం సీనియర్ నేత టి.షడ్రక్ వర్ధంతి సభలు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. మంత్రి టిజి.భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పుట్టిన రోజులు అట్టహాసంగా జరుపుకున్నారు.

పెరిగిన సైబర్ నేరగాళ్లు: ఇటీవల మార్కెట్ మాస్టర్, హెచ్‌యుజిఇ, షేర్‌బూస్టర్, క్విక్‌ప్రాఫిట్, స్టాక్ విజర్డ్, వంటి పెట్టుబడి యాప్ లు, సోషల్ మీడియా, టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను సైబర్ నేరగాళ్ళు మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చాయి. అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ ఈ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి అనంతరం మూసివేస్తున్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి.



కేంద్ర సాయుధ బలగాల కవాతు

-ప్రజలకు భరోసా కల్పించేందుకే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శనివారం కర్నూలు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణంలో భాగంగా ప్రజలకు మేము ఉన్నామనే భరోసా కల్పించేందుకే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కేంద్ర సాయిధ బలగాలు , కర్నూలు పట్టణ పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ , కిడ్స్ వరల్డ్ , పూల బజారు, గాంధీ చౌక్ , మించిన్ బజార్, కాంగ్రెస్ ఆఫీసు మీదుగా కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు, ప్రజలకు ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే తక్షణ సాయం అందిస్తామని, రానున్న వినాయక చవితి , స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

వర్షానికి రోడ్లు బురదమయం

గుంతల్లో నిలిచిపోతున్న వాహనాలు - అధికారుల ప్రాథమిక చర్యలు సూన్యం

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ మండల కేంద్రంలో శనివారం 52శాతంగా వర్షపాతం నమోదు అయ్యింది. కురిసిన వర్షానికి రోడ్లు జలమయంగా మారాయి. ఇందులోనే ఏర్పడిన గుంతల్లో అధిక నీరు చేరి కదలక అక్కడ వాహనాల రద్దీతో బురదమయంగా మారి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఏర్పడింది. టాట ఏస్‌లు, బైకులు, చిన్న కార్లు, ట్రాలీ ఆటోలు, త్రీ వీలర్ పాసింజర్ ఆటోలు వంటివి గుంత బురద రోడ్లలో ఇరుక్కొని పోయి కదలని స్థితిలోకి వెళ్తున్నాయి. ఇక్కడే పలు వాహనాలు ముందుకు వెళ్ళుటకు వీలుగా లేక అవస్థలుపడుతున్నారు. కస్తూరిబా నుండి మోడల్ స్కూల్ వరకు ఒక్క వంద అడుగులు కూడా రోడ్డు బాగలేదు. ఇలా ఎన్నేళ్లు ఈ రోడ్డు దుస్థితి, మారదా.. అంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుపై వర్షాలు వస్తే కనీసం సజావుగా ప్రయాణం సాగదు. ఇక అధికారులు కనీసం ప్రాథమిక చర్యలు చేపట్టిన ఆనవాళ్లు కానరావడం లేదు. అధికారుల వైఖరిని ప్రజలు, మహిళలు, ఆయా సంఘాలు నిరసిస్తున్నాయి. ఈ శనివారం బస్టాండ్ సమీపంలో ఓ వాహనం ఇరుక్కొని పోయి ముందుకు వెళ్ళడానికి నానా అవస్థలు పడ్డారు.సిమెంట్ రోడ్డు కోసం ప్రభుత్వం మూడు కోట్లు కేటాయించారని త్వరలో పనులు మొదలు పెడతారని అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటికి ఏడాది పూర్తి అయ్యిందని రోడ్డు దుస్థితి మారదా అంటున్నారు.



సి బెళగల్‌లో బురదనీటిలో కూరుకుపోయిన వాహనం

పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం గుంతల రోడ్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ప్రజాప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యనికి నిదర్శనమే గుంతల రోడ్లని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ విమర్శించింది. శనివారం డివైఎఫ్ఐ బృందం కర్నూలు నగరంలోని అనేక గుంతలు పడ్డ రోడ్లను పరిశీలన చేసింది. పరిశీలనలో భాగంగా పాత ఓల్డ్ ఈద్గా, గాయత్రి హాస్పిటల్ ప్రధాన రహదారి, బళ్లారి చౌరస్తా, హెచ్‌పి పెట్రోల్ బంక్, వీకర్ సెక్షన్ కాలనీ ప్రధాన రహదారి పరిశీలన చేశామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రాఘవేంద్ర,అబ్దుల్లా తెలిపారు. ఈ రోడ్లలో ప్రతిరోజు జిల్లా కలెక్టర్‌తో సహా అనేకమంది జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. రోడ్లు గుంతల మయంగా చెరువులు తలపించే విధంగా మారాయంటే అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదని విమర్శించారు. మంత్రి నియోజకవర్గంలో గుంతలు పడ్డ రోడ్లు ప్రమాదకరమైన ప్రయాణాలు ఉంటే ఇతరులకు ఎలాంటి ఆదర్శం చూపిస్తారని ప్రశ్నించారు. గుంతల రోడ్లలో ప్రయాణాలు చేయలేక వెన్నునొప్పులు ఇతర అనారోగ్యాలకు ప్రజలు గురవుతున్నారని తెలియచేశారు. నిత్యం తిరిగే అంబులెన్స్‌లు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కర్నూలు నగరంలో ఇలాంటి గుంతలు పడ్డ రోడ్లు అనేకం ఉన్నాయని, వాటన్నిటిని వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఆగుతున్న మురుగు నీటి పరిష్కారం కోసం డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ యువజన సంఘం మున్సిపల్ కార్యాలయం, మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. పరిశీలన బృందంలో డివైఎఫ్ఐ నాయకులు సాయి ఉదయ్, విశ్వనాథ్, రఘువరన్, కిరణ్, రాము, సాయి పాల్గొన్నారు.



కర్నూలులో గుంతల రోడ్డును పరిశీలిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మెడికవర్‌లో రోగుల మధ్య రాఖీ పండుగ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీక అయిన రక్షా బంధన్ పండుగను కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్‌లో హర్షాతిరేకాల మధ్య జరుపుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ముఖాల్లో ఆనందం నింపి, వారికి కుటుంబ వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఈ వేడుకను ప్రత్యేకంగా నిర్వహించింది. వైద్యులు, నర్సులు , సిబ్బంది రోగులకు రాఖీలు కట్టి, మిఠాయిలు పంచి, స్నేహభావాన్ని పంచుకున్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు సెంటర్ హెడ్ డాక్టర్ వై. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రోగులు ఆసుపత్రిలో ఉన్నప్పుడు, వారు కుటుంబ సభ్యుల దూరాన్ని ఎక్కువగా అనుభవిస్తారు. ఇలాంటి సందర్భాలు వారికి మానసిక బలం, ఆనందం కలిగిస్తాయి. ఇది వారి కోలుకునే ప్రక్రియలో కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. డాక్టర్ శిల్పా చౌదరి పెద్దపొల్ల కన్సల్టెంట్ యూరోగైనకాలజీ, ప్రసూతి వైద్యులు అండ్ గైనకాలజిస్ట్ డాక్టర్ సువర్ణ లక్ష్మి కల్లి, కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ మాట్లాడుతూ రోగుల శారీరక చికిత్సతో పాటు మానసిక స్థైర్యం కూడా చాలా ముఖ్యమన్నారు. రాఖీ పండుగ వంటి సాంస్కృతిక వేడుకలు రోగులకు ఆనందాన్ని, ధైర్యాన్ని అందిస్తాయి. ఇది ఒక హాస్పిటల్ మాత్రమే కాదు, ఒక పెద్ద కుటుంబం అని వారికి గుర్తు చేస్తాయని పేర్కొన్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ ప్రత్యేక వేడుకను హృదయపూర్వకంగా ఆస్వాదించి, హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



జిజిహెచ్‌లో అరుదైన రెండు శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో శస్త్రచికిత్స రెండవ విభాగంలో ఇటీవల రెండు అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలను ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయిక్ మీడియాకు తెలిపారు. మొదటి కేసు బేతంచర్లకు చెందిన సుమలత (25) నాలుగేళ్లుగా తరచూ రక్త వాంతులు, అధిక రక్తస్రావం, ప్యాన్సైటోపెనియా కారణంగా పునరావృత రక్త మార్పిడి తీసుకుంటూ వచ్చారు. గతంలో ఇవిఎల్ బ్యాండింగ్ చేయించుకున్న ఈమెను జులై1న ఆసుపత్రిలో చేర్పించారు.అదేనెల 24న స్ప్లీపెనెక్టమీ అనంతరం స్ప్లీపెనోరెనల్ షంట్ శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స సమయంలో ప్లీహ పరిమాణం 20 ఐ15 సెం.మీ బరువు సుమారు 1.5 కిలోలుగా నమోదైంది. చేరిన సమయంలో ఆమె ప్లేట్‌లెట్ సంఖ్య కేవలం 46,000 కౌంట్ ఉండగా, శస్త్రచికిత్స అనంతరం 5 లక్షలకు పెరిగింది. ఆపరేషన్ తరువాత ఎలాంటి సమస్యలు రాకుండా ఆగష్టు9న డిశ్చార్జ్ చేశారు. రెండవ కేసు గోనెగండ్లకు చెందిన రంగస్వామి (53), మద్యపానం అలవాటుపడి తరచూ కడుపునొప్పితో బాధపడుతూ క్రానిక్ కేల్సిఫిక్ పాంక్రియాటైటిస్‌గా నిర్ధారణ అయింది. ఆయనను జూన్26న ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. జూన్ 29న లాటరల్ ప్యాంక్రియాటికో–జెజునోస్టమీ చేశారు. శస్త్రచికిత్సలో పాంక్రియాస్‌లో సుమారు 10 రాళ్ళు, అతిపెద్దది 3ఐ2 సెంటీమీటర్ల పరిమాణంలో ఉండటం వంటి అరుదైనదిగా గుర్తించారు. జులై 5న శస్త్రచికిత్స అనంతర సమస్యలు లేకుండా డిశ్చార్జ్ అయ్యారు. ఈ శస్త్రచికిత్సలను ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయిక్ నిర్వహించారు. వారికి తోడుగా ప్రొఫెసర్ డాక్టర్ జయరాం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రశాంతి , పీజీలు కూడా శస్త్రచికిత్స బృందంలో భాగమయ్యారు. అనస్థీషియా బృందంలో ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవ్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కర్నూలు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పి.హరిచరణ్ శస్త్రచికిత్స బృందాన్ని అభినందించారు.



మహేంద్ర రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ పై చర్యలు

-పోలీసులకు ఫిర్యాదు చేసిన బొల్లవరం రైతులు

-విచారిస్తామని కర్నూలు రూరల్ సిఐ హామీ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : మా భూములను తమకు మార్ట్ గేజ్ చేసినట్లు ఇసిలో వచ్చే విధంగా మోసపూరితంగా వ్యవహరించిన మహేంద్ర రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ పై చర్యలు తీసుకుని తమ భూములు తమ పేరుపై వచ్చే విధంగా చూడాలని కర్నూల్ రూరల్ సర్కిల్ సిఐ చంద్రబాబుని రైతులు కాజా, చాకలి వెంకటస్వామి, చాకలి రామన్న, చాకలి వీరన్న, చాకలి మస్తాన్ వేడుకున్నారు. వారు మాట్లాడుతూ మహేంద్ర ఫైనాన్స్ దగ్గర తాము ఎలాంటి రుణాలు తీసుకోలేదని తెలిపారు. తన కూతుర్ల పేరుపై భూమి రాసి ఇద్దామని ఒక రైతు, అనారోగ్యంతో మరొక రైతు, బ్యాంకు రుణాల కోసం కొందరు రైతులు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి ఇసి తీయగా తమ పేరు రాకుండా మహేంద్ర రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ పేరు వస్తుందన్నారు. కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా సమీపంలో మహేంద్ర రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి మా భూములు మీ పేరుపై ఎలా మార్చారని ప్రశ్నించగా స్పందించడం లేదన్నారు. మహేంద్ర ఫైనాన్స్ పేరును తొలగించి మా భూములు మా పేరుపై బదిలీ చేయాలని కోరగా నా చేతుల్లో లేదని సబ్ రిజిస్టార్ తెలిపారన్నారు. పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ కర్నూలు సమీపంలో రైతులకు తెలియకుండా వారి భూములు మహేంద్ర హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ తన పేరుపై ఎలా మార్చుకుందని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ అధికారులు మహేంద్ర కంపెనీ వారు కుమ్మక్కైనట్లు ఉందన్నారు. సిఐ మాట్లాడుతూ విచారణ జరిపి మహేంద్ర ఫైనాన్స్ పై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సిఐని కలిసిన వారిలో పిపిఎస్ ఎస్ ప్రతినిధులు ఎండీ యూనూస్, ఎస్ రమణ గౌడ్ రైతులు ఉన్నారు.



నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వై.జయరాజు, తదితరులు

ప్రజాస్వామ్యానికి సంకెళ్లా..?

ప్రముఖ న్యాయవాది జయరాజు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

రాజ్యం కుట్రపూరితంగా వ్యవహరించి ప్రజాస్వామ్యానికి సంకెళు వేయడం దుర్మార్గమని ప్రముఖ న్యాయవాది జయరాజు అన్నారు. శనివారం రాత్రి టిజివి కళాక్షేత్రంలో విరసం ఆధ్వర్యంలో ఆదివాసీ హక్కుల నేత స్టాన్‌స్వామి రచించించిన జైలు డైరీ 'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో పౌరులకు న్యాయం అందడం లేదని, స్టాన్ స్వామి ఉదంతమే ఉదాహరణ అన్నారు. నేరస్థులు తప్పించుకుని తిరుగుతున్నారని, నేరం చేయని వాళ్ళు బందీలౌతున్నారన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈ పుస్తకం నివాళి కాదని ఇది ప్రగతిశీల వాదులకు కార్యాచరణగా భావించాలన్నారు. సభలోవిరసం నాయకులు పాణి, అరుణ్ ప్రసంగించారు.



పొంగిపొర్లుతున్న వాగు

భారీ వర్షాలతో పొంగిపొర్లిన వాగులు

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లాయి. వీధుల్లో ఎటు చూసినా డ్రెయినేజీ కాలవలు వర్షపు నీటితో ప్రవహించాయి. నందవరం నుంచి మాచాపురం మధ్య ఉన్న వాగు పొంగి వంతెనపై ప్రవహించింది. రాకపోకలకు ఉదయం చాలా వరకు అంతరాయం కలిగింది. గత మూడేళ్లుగా సరైన వర్షాలు లేక, సరైన పంటల పండక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈఏడాది వర్షాలు మే నెల నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. గత మూడేళ్లుగా పడిన వర్షాలతో ఒక్కసారి కూడా వాగు ప్రవహించలేదని ప్రజలు చెబుతున్నారు. వర్షాలు లేకపోవడంతో గ్రామంలో చాలాచోట్ల భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు ఎండిపోయాయి. గ్రామంలో నీటిఎద్దడి నెలకొంది. ఇప్పుడు కురిసిన వర్షం గ్రామానికి కొద్దిగా వరకు ఉపశమనం కలిగించిందని ప్రజలు పేర్కొంటున్నారు.

బాబు పాలన ఫ్లాప్ : వైసిపి



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో చంద్రబాబు పాలన ఫ్లాప్ అయిందని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిరుతపల్లి, మల్లన హట్టి, కరణి, తిప్పాలదొడ్డి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల గురించి ప్రజలకు వివరించారు. అర్హులై ఉండి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు అందలేదని ప్రజలు పేర్కొంటున్నారని తెలిపారు. రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, నరసింహులు, ఫకీరయ్య గోవిందు, హంపయ్య, పాల్ దినకరన్, అవతారం, సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి, అనిల్, సిద్దేష్, రామస్వామి, మారెప్ప, అయ్యప్ప, విజయ్ కుమార్, రమేష్, ఉప్పలప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మేషన్ డే

ప్రజాశక్తి - ఆదోని



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్టణంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఫార్మేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఉన్న అనాథ విద్యార్థుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.మారుతి రావు, ఐవైసి టౌన్ ప్రెసిడెంట్ దేవి శెట్టి వీరేష్ మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అంతకుముందు చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ దిలీప్ దొక, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ వై.సాయినాథ్, ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరీ ఎ.శ్రీనిధి రాయల్, మాణికరాజ్, ఫరూక్, బండారి తాయన్న, రామన్న యాదవ్ పాల్గొన్నారు.

రణమండల కొండపై భక్తుల కిటకిట

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారు ప్రాంతంలోని రణమండల కొండ భక్తులతో కొండ కిటకిటలాడింది. శ్రావణ మాసం మూడో శనివారం ఆంజనేయ స్వామిని దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే భారీగా తరలివచ్చారు. ఆదోని ప్రాంత భక్తులే కాకుండా జిల్లా నలుమూల నుంచి, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే స్వామి వారికి సింధూర అర్చన, హారతి, పంచామృతాభిషేకం, ఆకు పూజ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకి సేవ అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. దాతల సహకారంతో పట్టణంలోని శ్రీనివాస భవన్ నుంచి రణమండల కొండ వరకు ఆర్‌టిసి బస్సును తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నడిపినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో సిఐ శ్రీరామ్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

డ్రెయినేజీ, సిసి రోడ్లు కరువు

- రోడ్లపైనా, ఇళ్ల ముందు మురుగునీరు
- ఎస్సీ కాలనీలో అవస్థలు

ప్రజాశక్తి -దేవనకొండ

ఎస్సీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనా, ఇంటి ముందు మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దళిత వాడల అభివృద్ధికి ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

దేవనకొండ ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీరు రహదారిపైనా, ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వర్షపు నీటికి మురుగునీరు చేరి జత కావడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీవాసులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాల్సిన ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీరు ఇళ్ల ముందే నిల్వ ఉండడంతో దుర్వాసనతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



రహదారిపై ఆగి ఉన్న మురుగునీరు

సిసి రోడ్లు, మురుగు నీటి కాల్వలు నిర్మించాలి

- తిమ్మయ్య, కాలనీవాసి



ఎస్సీ కాలనీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం. మురుగు నీటి కాల్వలు, సిసి రోడ్లు నిర్మించాలి.

అధికారులు పరిశీలించాలి

- బలరాముడు, కాలనీవాసి



కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలి. పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకుని దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టాలి.

సమృద్ధిగా వర్షాలు

- జలమయమైన నెరనికి ఎస్సీ కాలనీ
- పొంగిపొర్లిన వందవాగిలి బస్టాండ్ పక్కన వంక

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మండలంలోని నెరనికి గ్రామం ఎస్సీ జలమయమై చెరువును తలపించింది. ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. వందవాగిలి బస్టాండ్ పక్కన వంక పొంగిపొర్లడంతో కొంతవరకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఈ వర్షం వల్ల చిన్నపాటి ఇబ్బందులు ఎవరైనా రైతులకు మాత్రం మంచిదని పేర్కొంటున్నారు.

ఆనందంలో రైతులు

రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు మంచి పదునుగా పేర్కొంటున్నారు. గత నెలన్నర రోజులుగా వర్షాలు రాక పత్తి, కంది తదితర పంటలు కళ తప్పి ఎదుగుదల నిలిచిపోయాయి. ఈ పైర్లకు వర్షాలు జీవం పోసినట్లయింది. రైతులు పొలాల్లో ఎరువులు చల్లడం, మందులు పిచికారి చేయడంలో బిజీగా ఉన్నారు. వరి నారు అంటించుకునే రైతులకైతే ఈ వర్షం ఇంకొంచెం లాభదాయకంగా మారింది.

సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయండి

శనివారం కురిసిన వర్షానికి మా కాలనీ మొత్తం జలమయమై చెరువుని తలపిస్తోందని, సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నెరనికి గ్రామం ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు.



పొంగిన వందవాగలి బస్టాండ్ వంక

ఉరుకుంద ఇఒ అక్రమ బదిలీని రద్దు చేయాలి

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం



శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్, ఇఒ విజయ రాజు అక్రమ బదిలీని రద్దు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుణ్యక్షేత్రంలో ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడు చేయని అభివృద్ధిని విజయరాజు చేశారని తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తుల కోసం తాగునీరు, దర్శనం, వసతి, అన్నదాన సత్రంలో మార్పులు చేసి భక్తులకు రెండు పూటల భోజన సౌకర్యం కల్పించారని చెప్పారు. దాతల సహకారంతో రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. క్షేత్రంలో అక్రమాలను అరికట్టి దేవాలయం ఆదాయం పెంచారని చెప్పారు. పూజారులు, కాంట్రాక్టర్లు, కొంతమంది గిట్టనివారు, అక్రమంగా తినడానికి కక్కుర్తి పడినవారు లేనిపోని మాటలు చెప్పడం తగదన్నారు. ఇలాంటి అధికారిపై ఎవరో చెప్పిన మాటలు విని రాజకీయ నాయకులు బదిలీ చేయించడం తగదన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రానికి వచ్చి అభివృద్ధిని చూసి, ప్రజల అభిప్రాయాలను సేకరించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆనంద్ కూడా పైవిధంగా స్పందించారు.

అనారోగ్యంతో ముగ్గురు మృతి

- ఒక విద్యార్థిని, ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి - హోళగుంద



రూప (ఫైల్)

హోళగుంద గ్రామంలో అనారోగ్యంతో ముగ్గురు మృతి చెందారు. ఒక విద్యార్థిని, ఇద్దరు వృద్ధులు, అన్నదమ్ములు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి... హోళగుంద గ్రామానికి చెందిన కె.రూప అనారోగ్యంతో హోళగుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రం మాటసూగూరు గ్రామంలో శారద ప్రయివేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. విద్యార్థిని గత ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో పోరాడి మృతి చెందడంతో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. విద్యార్థిని తండ్రి శరణప్ప కన్నడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె రూప సంతానం. రూప అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే ఒకే ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు జమాపురం భద్రప్ప (74), జమాపురం చెన్నప్ప (76) అన్నదమ్ములు ఒకే రోజు మృతి చెందారు. వారి కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హీమోఫిలియాపై అవగాహన



ఫిజియోథెరపీ కిట్లను అందజేస్తున్న వైద్యులు

- ఫిజియోథెరపీ కిట్ల అందజేత

ప్రజాశక్తి - గోనెగండ్ల

హీమోఫిలియా రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర్నూలు చాప్టర్ హిమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమావేశ భవనంలో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా గోనెగండ్ల ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంగా రవళి, కర్నూలు చాప్టర్ హిమోఫిలియా సొసైటీ అధ్యక్షులు ఆర్.పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కెసి.నాగరాజు హాజరయ్యారు. ముందుగా హాజరైన వారికి మందులు పనిచేస్తున్నాయా లేదా అని రక్త నమూనాలను సేకరించి ఫ్యాక్టర్ పనితీరు నిర్ధారిత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ విశ్వనాథ్ ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హిమోఫిలియా అనేది జన్యుపరమైన వ్యాధి అని, ఈ వ్యాధిలో రక్తస్రావం జరిగితే నిలబడకపోవడం, మనకు తెలియకుండానే శరీరంలో రక్తస్రావం అవుతుందని తెలిపారు. దీనివల్ల మోచేతులు, మోకాళ్లు, కీళ్లు, కండరాల వాపులు రావడం వల్ల భరించలేని నొప్పి ఉండడంతో పాటు వికలాంగులుగా మారిపోతారని చెప్పారు. తమ సొసైటీ ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 150 మందిని గుర్తించామని, ఇంకా గుర్తించని వారు ఇంతకు రెట్టింపు ఉండవచ్చని తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తులు మందులు దొరకక ఇబ్బందులు పడేవారని, తమ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులను కలిసి విన్నవించడం ద్వారా కర్నూలు, నంద్యాల ప్రాంతాల్లో వారికి అవసరమైన ఫ్యాక్టర్ మందులు దొరికేలా కృషి చేశామని అన్నారు. నంద్యాల, చాగలమర్రి, హోళగుంద, కౌతాళం, ఆదోని, కర్నూలు, మంత్రాలయం నుంచి వచ్చిన సుమారు 60 మందికి అవసరమైన ఫ్యాక్టర్ మందులు, ఫిజియోథెరపీ కిట్లను ఇంటాస్ ఫౌండేషన్ వారు ఉచితంగా అందజేశారు. ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధులు కరుణాకర్, శివకుమార్, సుజాత పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

- ప్రమాదాలు జరిగితేనే గుర్తుకొస్తుందా..?

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరి, ఏరూరు డేగల హాల్ రోడ్డు

చిప్పగిరి నుంచి ఏరూరు, డేగలహాల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారయింది. మార్గమధ్యంలో అక్కడక్కడ రోడ్డు అంతా దెబ్బతినింది. కంకర తేలి, గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని ఈ గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఏ వాహనంలో వెళ్లినా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. రోడ్డుకు ఎక్కువ గుంతలు ఉన్న దగ్గర ప్రమాద సూచికలైనా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోకపోతే ప్రమాదాతు సంభవించకుండా గుంతలు ఉన్న దగ్గర రాళ్లు అడ్డుపెట్టి ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తామని ప్రజలు అధికారులకు తెలియజేస్తున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మా గోడును పట్టించుకోరా..?

- ఓబులేసు, ఏరూరు గ్రామం



వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. పొలాలకు ఎరువులు, మరి ఏదైనా పనులకు వెళ్లాలన్నా ఈ రోడ్డు వెంటే చిప్పగిరికి, గుంతకల్ పట్టణానికి ప్రయాణం చేయాల్సి ఉంది. ప్రమాదాలను అరికట్టడానికి, ప్రజలకు వాహన సౌకర్యం ఉండాలన్నా అధికారులు స్పందించి రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - దేవనకొండ

శ్రావణమాసం మూడో శనివారంలో భాగంగా మండలంలోని నల్లచెలిమెల గ్రామంలో శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మినరసింహ స్వామి ఆలయంలో వేద పండితులు, కరణాల మంత్రోచ్ఛరణల మధ్య పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామివారి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కనువిందుగా రాఘవేంద్రుని బృందావనం

- స్వర్ణ శోభితమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం స్వర్ణ శోభితమై స్వామి వారి బృందావనాన్ని దర్శించుకున్న భక్తులను కనువిందు చేస్తోంది. శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా స్వామి వారి 354వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు శ్రీమఠాన్ని పసిడి కాంతులతో అలరింపజేశారు. శనివారం శ్రీరాఘవేంద్రస్వామి బృందావనం పూర్తిగా నవరత్న, బంగారు తొడుగులతో అలంకరించింది. బృందావనం ముందున్న రాతి స్తంభాలకు సైతం భక్తుల దాతృత్వంతో స్వర్ణ కవచాలను అమర్చి స్వర్ణ కాంతిని ప్రకాశింపజేశారు. శ్రీమఠం ప్రాకారంలో శిలా మండపం చుట్టూ పైభాగంలో పసిడి పూతతో తొడుగులు అలంకరించి స్వర్ణ మయం చేశారు. ఇక శ్రీమఠం గోపురానికి కూడా స్వర్ణ పూతతో గతేడాది క్రితమే మెరుగులు దిద్దారు. బయట భాగంలో ఉన్న శ్రీమధ్వ కారిడార్‌ను హితిహాసాలను కళ్లకు కట్టే విధంగా చిత్రాలతో గుర్తు చేసే విధంగా తీర్చి దిద్దారు. విద్యుత్ దీపాలతో ముస్తాబయిన శ్రీరాఘవేంద్రస్వామి మఠం భక్తులకు ఆహ్లాదకరంగా ఆనందం కలిగిస్తోంది.



ఊరేగింపు నిర్వహిస్తున్న పీఠాధిపతులు, సిబ్బంది

శ్రీమఠం చేరిన టిటిడి పట్టు వస్త్రాలు : టిటిడి నుంచి వచ్చిన పట్టువస్త్రాలు ఊరేగింపుతో శ్రీరాఘవేంద్ర స్వామి మఠం చేరుకున్నాయి. రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా టిటిడి ఎఇఒ రామకృష్ణ టిటిడి నుంచి శ్రీవారి వస్త్రాన్ని తీసుకొచ్చారు. శ్రీమఠం అధికారులు, పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ఆర్చి మహాద్వారం వద్ద నుంచి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మధ్వ కారిడార్ గుండా శ్రీమఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మకు చీరను అందజేశారు. అనంతరం శ్రీవారి వస్త్రాన్ని శ్రీస్వామిజీకి అప్పగించారు. శ్రీస్వామిజీ శ్రీస్వామి వారి మూల బృందావనం వద్ద వస్త్రాన్ని సమర్పించారు.

మూల రాములకు ప్రత్యేక పూజలు : శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు శ్రీమఠం పూజా మందిరంలో పండితుల వేద మంత్రాల మధ్య పుష్పహారాల అలంకారంతో దూప, దీప నైవేద్యాలతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. మూల రాములు, జయ రాములు, దిగ్విజయ రాముల మూర్తులను చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు.

తొలిసారి ప్రహ్లాద రాయులకు తెప్పోత్సవం : శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులకు తెప్పోత్సవం నిర్వహించారు. శ్రీపరిమళ పుష్కరిణిలో అలరారుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకుముందు శ్రీమఠం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీబృందావన గార్డెన్ అతిథి గృహం సముదాయం ముందు నూతనంగా నిర్మించిన పరిమళ పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం పుష్కరిణిలో కనువిందు చేశారు. పుష్కరిణి మధ్యలో నిర్మించిన మండపంలో చుట్టూ దీపాలను వెలిగించి స్వామి వారికి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, అల్లుడు కృష్ణ కౌశిక్, ద్వారపాలకు అనంతస్వామి, ప్రకాష్ రావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

సప్త రాత్రోత్సవాల్లో ప్రముఖులు : శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. శ్రీమఠం పీఠాధిపతుల ఆహ్వానం మేరకు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీషానంద, డిప్యూటీ సొల్లిషియోటర్ శాంతి భూషణ్, తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసు శాఖల మంత్రి వాకిట శ్రీహరిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామి వారి తెప్పోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రథోత్సవాల్లో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

దళితులపై దాడులను ఆపండి

- సమతా సైనిక్ దళ్ రాయలసీయ అధ్యక్షులు రంగయ్య


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితులపై దాడులను ఆపాలని, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దళిత యువకుని నిర్బంధించి దాడి చేయడం దుర్మార్గమని సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షులు రంగయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంకా వైసిపి నాయకులు అధికారంలో ఉన్నామనే భ్రమలో దాడులు చేస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కార్ల కింద సింగయ్య అనే దళితుడిని చంపేస్తే ఆ పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దళితులే జగన్‌ను గద్దె దింపారని కక్షతో దాడులను ప్రోత్సహిస్తున్నారా అని ప్రశ్నించారు. దళితుల జోలికి వస్తే గత ఎన్నికల్లో రెండంకెల సంఖ్యకు పరిమితం చేశారని, రాబోయే ఎన్నికల్లో ఒక సంఖ్యకే పరిమితం చేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలతో సుభిక్షంగా ఉందని, అది ఓర్వలేక ఓటమికి కారణమయిన దళితులపై దాడికి యత్నిస్తున్నారని విమర్శించారు. జగన్ రెడ్డి పరామర్శలకు, ర్యాలీలకు అనుమతులు ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని కోరారు. సమతా సైనిక్ దళ్ రాయలసీమ నాయకులు పరమేష్, జిల్లా నాయకులు రాముడు, సీనియర్ నాయకులు నాగప్ప, రాజోలప్ప, గోవిందు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త అవసరం

- డాక్టర్ మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



వర్షాకాలంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వారి ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతూ, జాగ్రత్తలు పాటించాలని భావన ఆస్పత్రి చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొత్త, పాత నీరు కలిసి మార్పు వస్తుందని, తాగిన వారు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి వాతావరణ పరిస్థితులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందన్నారు. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడుతారని తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల ఈగల వ్యాప్తి పెరుగుతుందని, అవి వాలిన పదార్థాలు తినడం వల్ల వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. పిల్లలకు తరచూ సబ్బుతో ఒళ్లంతా స్నానం చేయిస్తూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. పిల్లలకు తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరం వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ సమయం చిన్న పిల్లలను ఆరుబయట ఉంచకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో వేడి చేసిన నీటినే తగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమకాటు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే ప్రమాదం ఉందని చెప్పారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే స్పెషలిస్టులను సంప్రదించి పిల్లలకు మెరుగైన వైద్యం చేయించాలన్నారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో భావన ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. అన్ని రకాల పరీక్షలు చేయిస్తూ అత్యవసర చికిత్సలు, ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటూ 24 గంటలు రోగులను పర్యవేక్షిస్తామని తెలిపారు. టీకాలు, వాక్సినేషన్ సదుపాయం ఉందన్నారు. చర్మవ్యాధి రోగులకు స్కిన్ స్పెషలిస్ట్ అందుబాటులో ఉన్నారని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




భావన ఆస్పత్రి

సిఐని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సిఐగా బాధ్యతలు చేపట్టిన సిఐ గంగాధర్‌ను వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, యూత్ విభాగం జిల్లా కార్యదర్శి ప్రకాష్, సొసైటీ మాజీ ఛైర్మన్ నరసింహులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి సన్మానించారు. శాంతిభద్రతల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టి అరికట్టాలని, మట్కా, పేకాట, బెల్టుషాపులు గ్రామంలో విచ్చలవిడిగా నడుస్తున్నాయని తెలిపారు. వైసిపి నాయకులు ప్రకాష్, శివయ్య, మహానంది పాల్గొన్నారు.



సిఐ గంగాధర్‌ను కలిసిన వైసిపి నాయకులు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : సిఐ

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సిఐ గంగాధర్ హెచ్చరించారు. పట్టణంలోని పత్తికొండ రహదారిలో పలువురు వాహనదారులకు డ్రింక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా జాతర ప్రాంగణం భక్త జనసందోహంతో కిక్కిరిసింది. తేరును లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. వందలాదిమంది భక్త జనసందోహం మధ్య రథచక్రాలు ముందుకు కదిలాయి. బాపురం దగ్గర ఉన్న కొండపై స్వామి పాదుకలను కడిగి అక్కడి నుంచి నీరు చలువ బిందె ద్వారా తీసుకుని క్షేత్రగుడిలో ఉన్న ఆంజనేయ స్వామికి సమర్పించారు. అనంతరం రథోత్సవం లాగారు.

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు


ప్రజాశక్తి - కోసిగి

స్థానిక కడేపాళ్యం, సిద్ధప్పపాలెంలో వెలసిన తొగట వీరక్షత్రియ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీచౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ అర్చకులు, కమిటీ అధ్యక్షులు ఓం ప్రకాష్, డిసి.నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహామంగళ హారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తుంగభద్ర జలాలను జ్యోతుల్లో ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా ఆలయం వద్దకు చేరారు.

మనస్సున్న మారాజు మహేష్

- ఘనంగా సూపర్‌స్టార్ మహేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

కష్టకాలంలో 'నేనున్నా న'ంటూ ముందుకొచ్చి ఎన్నో సేవలు చేసి, ఎంతో మంది చిన్నారులను ఆదుకుంటున్న మనస్సున్న మారాజు సూపర్ స్టార్ మహేష్ బాబు అని ఎమ్మిగనూరు తాలూకా ఫ్యాన్స్ అధ్యక్షులు వహాబ్ తెలిపారు. శనివారం వహాబ్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని మినీ శ్రీనివాస థియేటర్‌లో అభిమానుల సమక్షంలో థియేటర్ యజమానులు నాగిరెడ్డి, వంశీరెడ్డిలు కేక్ ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పట్టణంలోని మహాత్మ గాంధీ బ్లడ్ సెంటర్‌కు రక్తదానం చేసి బ్లడ్ డోనేట్ చేశారు. సీనియర్ అభిమానులు ఆనంద్, శ్రీనివాసులు, మధు, ఫిల్మ్ ఆర్ట్ డైరెక్టర్ మణికంఠ, అరుణ్, సుమేద్, గిరీష్, శ్రావణ్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PAALA KAILASH (Old Name) R/o. H.No. 76/111/46-24-1, Brundhavan Nagar, Bellary Chowrastha Kurnool District - AP, have changed my name as **PAALA SAI CHARAN** (New Name), S/o. Paala Chandra Sekhar